క్లుప్తంగా

అంగన్‌వాడీలకు శిక్షణ

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో భద్రాచలం మండలాలకు చెందిన 37 మంది అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ ధనలక్ష్మి మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలలో 5 ఏళ్ల లోపు చిన్నారులకు ఆటపాటలతో పాటు ఇంగ్లిష్ మీడియం బోధన చేపట్టాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

అశ్వాపురం: వర్షాకాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ ముత్తినేని సుజాత అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని రైతువేదికలో మంగళవారం ఎంపీపీ సుజాత అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలు సమావేశంలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుజాత మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ స్వర్ణలత, యూడీసీ పద్మావతి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు ఎండి.షర్ఫియుద్దీన్, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బదిలీలు నిలిపి వేయండి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా హాస్పిటల్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా.. ఉన్న సిబ్బందిని బదిలీ చేయడం సరికాదని, తక్షణమే ఆ ప్రక్రియను నిలిపివేయాలని సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఐటీడీఏ పీఓ రాహుల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. స్థానికులతోపాటు పక్క రాష్ట్రాల నుంచి కూడా వైద్య సేవలు పొందడానికి ప్రజలు వచ్చే భద్రాచలం ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో.. మొత్తం 90 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తక్షణమే ఆ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ఆ తరువాత మాత్రమే వైద్యులను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, బండారు శరత్ బాబులు ఉన్నారు.

నిత్యావసరాల పంపిణీ

మణుగూరుటౌన్: మండలంలోని అశోక్‌నగర్ కుదిన నిరుపేదకు దోసపాటి లక్ష్మి జన్మదినం సందర్భంగా మంగళవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. పట్టణంలోని ఎస్‌కేటీ దుకాణంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి నెలకు సరిపడా రూ.2వేల విలువైన బియ్యం, పప్పుతో పాటు నిత్యావసరాలు దోసపాటి నాగేశ్వరరావు చేతులమీదుగా పంపిణీ చేశారు. వాసవీక్లబ్ అధ్యక్షురాలు బొగ్గవరపు అంజలి, ఎస్‌కేటీ నాగేశ్వరరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బండారు నర్సింహారావు, సెక్రటరీ శ్యామ్, ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు చిత్తలూరి రమేశ్, వడియాల ప్రభాకర్, బొగ్గవరపు మురహరి తదితరులు ఉన్నారు.

చెట్టు కొమ్మల తొలగింపు

ములకలపల్లి: మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయ సమీపంలో 33కేవీ విద్యుత్‌లైన్లపై వాలిపోయిన చెట్ల కొమ్మలను ఎట్టకేలకు తొలగించారు. సాయిబాబా ఆలయ సమీపంలో హైటెన్షన్ విద్యుత్‌లైనుపై భారీ వృక్షం ఒరిగిపోగా, చెట్టు కొమ్మలు తీగెలపై వాలిపోయి ప్రమాదభరితంగా మారాయి. దీంతో సమీప ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఈ నేపథ్యంలో 'హైటెన్షన్ .. టెన్షన్..' శీర్షికన ఇటీవల 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు.. వైర్లపై వేలాడుతున్న చెట్టు కొమ్మలను నరికేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పల్లెల్లో డ్రైడే కార్యక్రమం

దమ్మపేట: మండలంలోని గోపాలపురం, జమేదారుబంజర గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాన్ని పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ దివాకర్, తన వైద్య సిబ్బందితో కలసి స్థానికుల ఇళ్లకు వెళ్లి, పరిసరాలను పరిశీలించారు. టైర్లు, తాగి పడేసిన కొబ్బరిబొండాలు, బాటిళ్లు, కుండీలలో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. సీహెచ్‌ఓ కోటేశ్వరి, హెచ్‌ఈఓ సత్యనారాయణ, సూపర్‌వైజర్ బషీరుద్దీన్, ఎంపీహెచ్‌ఏ హర్షా, ఆశాలు పాల్గొన్నారు.

అయన్నపాలెంలో..

చంద్రుగొండ: మండలంలోని అయన్నపాలెం గ్రామంలో చంద్రుగొండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డ్రైడే నిర్వహించారు. ప్రతి ఇంటికీ తిరిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ కనకం తనుజ సూచించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ యండీ ఇమాం ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్‌కు వీడ్కోలు

చర్ల: ఆర్ కొత్తగూడెం ఏపీజీవీబీ బ్యాంకు నుంచి బదిలీపై వెళ్తున్న మేనేజర్ నరేష్, క్యాషియర్ ప్రమోద్‌లకు మంగళవారం స్థానిక బ్యాంకు ఆవరణలో స్థానికులు, బ్యాంకు సిబ్బంది సభ ఏర్పాటు చేసి వీడ్కోలు పలికారు. శాలువాలతో సన్మానించారు. స్థానికుల ప్రేమాభిమానాలు మరువలేనివని బదిలీ అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. కార్యక్రమంలో నూతనంగా వచ్చిన మేనేజర్, క్యాషియర్లు అనీల్‌కుమార్, నాగరాజు, స్థానిక పెద్దలు ఎడారి శ్రీనివాసరావు, ఎగ్గడి సాంబశివరావు, అల్లి ఉమామహేశ్వరావు, ఇందుల బుచ్చిబాబు, ఇమ్రాన్, సీఎస్‌పీలు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, లక్ష్మి, వీవీఏలు ప్రభారాణి, బ్యాంకు సిబ్బంది శివ పాల్గొన్నారు.

రహదారి కష్టాలు తీరేనా..?

- ధ్వంసమైన ఎల్సిరెడ్డిపల్లి ప్రధాన రహదారి
- ఏటా వాగు ఉధృతికి కోతకు గురవుతున్న రోడ్డు



పెద్దవాగు ఉధృతికి పూర్తిగా ధ్వంసమైన ఎల్సిరెడ్డిపల్లి ప్రధాన రహదారి (ఫైల్)



బురదమయంగా తయారైన తాత్కాలిక రహదారి

పినపాక: ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన ఎల్సిరెడ్డిపల్లి ప్రజల కష్టాలు తీరడం లేదు. వర్షాకాలం సమర్పిస్తే గ్రామస్తులు రహదారితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. ప్రధాన రహదారి మోకాల్లోతు వరకు బురదమయంగా మారి గ్రామం నుండి బయటికి రాలేని పరిస్థితి ఏర్పడుతుంది.

గత రెండు సంవత్సరాల నుంచి వర్షాకాలంలో పెద్దవాగు ఉధృతకి ఎల్సిరెడ్డిపల్లి ప్రధాన రహదారి కోతకి గురవుతోంది. మొదటి సంవత్సరం రహదారి కోతకు గురై రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో అధికారులు ప్రక్కనే ఉన్న పొలం నుంచి తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేశారు. గత సంవత్సరం వర్షాకాలంలో మళ్లీ వాగు ఉధృతికి పొలంలో వేసిన రహదారి కొట్టుకుపోయి రెండు రోజులు రాకపోకలు నిలిచిపోయాయి. దాంతో మళ్లీ పొలంలో తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేశారు.

బురదమయంగా రహదారి..

తాత్కాలిక రహదారి చిన్నపాటి వర్షాలకు కూడా బురదమయంగా మారుతోంది. అధికారులు పక్కనే ఉన్న రైతులతో మాట్లాడి పొలం నుంచి దారి ఏర్పాటు చేసినప్పటికీ వరదలకు రహదారి నిలవడం లేదు. వర్షాలకు రహదారితోపాటు పొలాలు కూడా కోత గురవుతున్నాయి. రహదారిపై మోకాల్లోతు బురద చేరి గ్రామస్తులకు నరకం కనబడుతుంది. వాహనదారులు కూడా తోసుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అధికారులు స్పందించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

రహదారిని పునరుద్ధరించాలి

ప్రతి సంవత్సరం వర్షాలు పడుతున్నాయంటే భయపడాల్సిన పరిస్థితి వస్తుంది. రహదారి కోతకు గురికావడం, మళ్లీ నిర్మించడం, మళ్లీ వర్షాలకు రహదారి పూర్తిగా దెబ్బ తినటం ఆనవాయితీగా మారుతుంది. అధికారులు స్పందించి వాగు వెంట సైడ్ వాల్ నిర్మించి, శాశ్వత రహదారి చూపాలి.

– జంపయ్య, ఎల్సిరెడ్డిపల్లి

ప్రతిపాదనలు పంపించాం

రహదారి కోతకు గురైనప్పుడు తాత్కాలిక రహదారి ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి సంవత్సరం రహదారి కోత గురవుతుందని ఆలోచించి ప్రత్యామ్నాయంగా గొట్టెల్ల నుంచి రెండు కిలోమీటర్ల రహదారికి ప్రతిపాదనలు పంపించాం. ఆమోదించిన వెంటనే రహదారిని నిర్మిస్తాం.

– రెనాల్ట్, పంచాయతీరాజ్ ఏఈ

నక్సలిజానికి దూరంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

గుండాల: యువత నక్సలిజానికి దూరంగా ఉండాలని, చదువు దృష్టి మళ్లించి ఉన్నత స్థాయికి చేరాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని సాయనపల్లి, ఎలగలగడ్డ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. నక్సల్స్‌కు సహకరించొద్దని, లేదంటే చర్యలు ఉంటాయని తెలిపారు. గంజాయి సేవించినా, రవాణా చేసినా, విక్రయించినా చట్టరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. జులై నుంచి అమలులోకి వచ్చిన ట్రాఫిక్ నిబంధనలు, చర్యలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎస్సై రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీలో ఆంక్షలు వద్దు

దమ్మపేట: ఎన్నికల హామీల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రూపాయల రుణమాఫీ ప్రక్రియను ఎలాంటి ఆంక్షలకూ తావులేకుండా అమలు చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని తాటిసుబ్బన్నగూడెం నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డు, పీఎం కిసాన్‌ల వంటి నిబంధనల పేరుతో రుణమాఫీ లబ్ధిదారుల సంఖ్యను తగ్గించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. నిబంధనలను వెనక్కు తీసుకోవాలని హితవు పలికారు.

బూర్గంపాడు: రాష్ట్ర ప్రభుత్వం షరతులు లేకుండా రైతులు తీసుకున్న పంట రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు పున్నంచంద్ అన్నారు. బూర్గంపాడులో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత షరతులు పెట్టి రైతులను ఇబ్బందులు పెట్టడం తగదన్నారు.

దుమ్ముగూడెం: రుణమాఫీ జీవోను రైతుల రుణమాఫీకి ప్రయోజనకరంగా సవరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ డిమాండ్ చేశారు.మంగళవారం ములకపాడు వైఎస్ భవన్‌లో బొల్లి సత్యనారాయణ అధ్యక్షతన రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు శ్రీనుబాబు, కోర్స రామ్ చిట్టి, బిల్లా ముత్యాలరావు, సరియం నాగేశ్వరావు, నల్లగొర్ల ప్రభాకర్, సరియం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో సమావేశం..

రుణమాఫీ, రైతు భరోసాను రైతులు అందరికీ వర్తింపచేయాలని తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు ఎండి.వలీపాషా డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు గడ్డిపాటి సత్యం, కట్టం ఎర్రప్ప, కణితి లక్ష్మణుడు, సోనం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు



అశ్వాపురం: మొక్కలు నాటుతున్న ఎంపీపీ, అధికారులు

అశ్వాపురం: ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణ, క్రీడా ప్రాంగణం ఆవరణలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీపీ సుజాత ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీఓ భూక్యా శ్రీనివాస్, ఏపీఓ నాగసీతరాములు, జిల్లా, మండల కో ఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దిన్, ఎస్‌కె.ఖదీర్, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు కమటం నరేష్, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

మణుగూరురూరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టిన వనమహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం కూనవరం గ్రామ పంచాయతీ పైగుంపు ప్రాంతంలో ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరియర్స్ వెంటనే చెల్లించాలి

మణుగూరుటౌన్: మున్సిపల్ కార్మికుల ఎరియర్స్‌ను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సత్రపల్లి సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావును కలిసి మంగళవారం సమ్మె నోటీస్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని సుమారు 70 మందికి 31 నెలల ఏరియర్స్ రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకలు నందం ఈశ్వర్‌రావు, పల్లపు నాగేశ్వరరావు, దుర్గారావు, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్టూ ఆధ్వర్యంలో..

మున్సిపల్ కార్మికులకు ఏరియర్స్ వెంటనే చెల్లించాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి మున్సిపల్ అధికారులను మంగళవారం కోరారు. దాదాపు 2సంవత్సరాలకు పైగా ఏరియర్స్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించగా, స్పందించిన మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు నిధుల కోరత వల్ల జాప్యం జరుగుతోందని, నిధుల వెసులుబాటు చూసుకుని చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్సూర్, రాజేందర్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, త్రిమూర్తులు తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలోని మొద్దులమడ గ్రామం, అశ్వారావుపేట బీసీ గురుకుల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరంలో వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో 36 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి, చిరు వ్యాధులతో బాధ పడే వారికి మందులు అందించారు. అనంతరం జ్వరాలు, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, సిబ్బంది సత్యనారాయణ, చెల్లమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలంలోని మద్దుకూరు, రామక్కబంజర్ గ్రామాల్లో మంగళవారం ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక రోగులను పరీక్షించి అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. సిబ్బంది డీపీఎంఓ వెంకటేశ్వరరావు, హెచ్‌ఈఓ పి.కృష్ణయ్య, కుమారిహారిక, లక్ష్మి పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆయుర్వేద వైద్యులు పావని వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను అందజేశారు. ఆరోగ్యంపై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వెంకటలక్ష్మి, ఏఎన్‌ఎం హెచ్.లక్ష్మి, ఆశా వర్కర్ కంగాల విజయకుమారి పాల్గొన్నారు.

గ్యారంటీలు అమలు చేయండి

దుమ్ముగూడెం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ భద్రాచలం డివిజన్ నాయకుడు దాసరి సాయన్న డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఈ నెల 22న తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ మంగళవారం చిన్నార్లగూడెం గ్రామంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాయకులు సున్నం వీరభద్రం, కల్లూరు శంకర్, అర్జున్, కన్నయ్య, రామశెట్టి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీరీల ఊరేగింపు



మణుగూరుటౌన్: శివలింగాపురంలో పీరీలను ఊరేగిస్తున్న భక్తులు

అన్నపురెడ్డిపల్లి: మొహర్రం పండుగను పురస్కరించుకుని మంగళవారం గ్రామాల్లో పీరీల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. భక్తులు పీరీలకు పూజా కార్యక్రమాలను నిర్వహించి, నైవేద్యాలను సమర్పించారు. భక్తిశ్రద్ధలతో అగ్ని గుండంలో నడిచి, తమ మొక్కులను చెల్లించుకున్నారు.

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని గాంధీబొమ్మ సెంటర్‌లో పీర్లను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. హిందూ, ముస్లిం భక్తులు గలీబులీ అర్పించి, ఆలాయ్ బలాయ్ చెప్పుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు దేశబోయిన పెద్ద హుస్సేన్, చిన్న హుస్సేన్, దేశబోయిన సైదులు, దేశబోయిన రాములు, దేశబోయిన లాలయ్య, పులి వెంకటేశ్వర్లు, పులి కృష్ణ, పులి మల్లేష్, ముజవారీలు హుస్సేన్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: మొహర్రం పండుగ వేడుకల్లో భాగంగా శివలింగాపురంలో పీర్ల ఊరేగింపును మంగళవారం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో వాడవాడలా తిరుగుతూ ప్రజలకు ఆశీర్వాదం ఇచ్చారు. కొత్తపల్లి సత్యనారాయణ, సీతారాములు, లక్ష్మయ్య, కాసిం సురేశ్, సాంబ, మహేశ్, వెంకటేశ్ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించగా.. సైదులు, రాంబాబు, సత్తి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో మంగళవారం ట్రాఫిక్ పోలీసులు అదనంగా 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని వివిధ ప్రధాన సెంటర్లలో ఇప్పటికే 25 సీసీ కెమెరాలు ఉండగా, అదనంగా మరో 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్ తెలిపారు.

రాపిడ్ ఫీవర్ సర్వే

చర్లరూరల్: కొయ్యూరు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం సుబ్బంపేట గ్రామంలో రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. బోధనెల్లి గ్రామపంచాయతీ గ్రామాల్లోని ఇళ్ళల్లో దోమల మందును పిచికారీ చేయించారు. అలాగే గొమ్ముగూడెం, తిమ్మిరిగూడెం, తేగడ, లింగాపురంపాడు, బూరుగుపాడు గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి నీటి నిల్వలను తొలగించి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కఠిన శిక్షలు అమలు చేయాలి

బూర్గంపాడు: రోజురోజుకూ మహిళలపై లైంగిక దాడులు పెరుగుతున్నాయని, ఈ దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు సీతామహాలక్ష్మి అన్నారు. సారపాకలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఐద్వా మండల రెండో మహాసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం 12మందితో ఐద్వా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు లీలావతి, పాపినేని సరోజిని, కొలురి నాగమణి, బత్తుల ద్రౌపతి, రామ వీరమ్మ, దాసరి పద్మ, టి.అరుణ పాల్గొన్నారు.

ఆయిల్‌ఫెడ్ చైర్మన్‌ను కలిసిన అలపాటి

దమ్మపేట: ఇటీవలే తెలంగాణ ఆయిల్‌ఫెడ్ చైర్మన్‌గా నియమితులైన జంగా రాఘవ రెడ్డిని, ఆయిల్‌పాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు అలపాటి రామచంద్ర ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలసి, శాలువాతో సత్కరించారు. మంగళవారం హైదారాబాద్‌లోని ఆయిల్‌ఫెడ్ కార్యాలయంలో చైర్మన్‌ను కలసిన అలపాటి.. జిల్లాలో జరుగుతున్న పామాయిల్ సాగు తీరును వివరించారు. పామాయిల్ దిగుమతి సుంకం ఎత్తివేయడం వల్ల పామాయిల్ గెలల ధర సగానికి పైగా తగ్గి, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

అమ్మవారికి పూజలు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారికి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముందుగా అమ్మవారికి కుంకుమాభిషేకాలు నిర్వహించి దాతలు అందజేసిన పట్టుచీరతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలను నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనం కలిగించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదం వితరణగా అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు నిర్వహించాలి

గుండాల: మండలంలో సీజనల్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్శక రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో వైద్యాధికారి మనేష్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ.. కొడవటంచ గ్రామంలో హెల్త్ సబ్‌సెంటర్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తాటి రమేష్, కల్తి ప్రమోద్, రామారావు, పగడయ్య, రమేష్, ప్రభాకర్, భాస్కర్, గిరి, పోతయ్య పాల్గొన్నారు.

అలుగు పారుతున్న వెంకమ్మ చెరువు



అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి గ్రామ సమీపంలోగల వెంకమ్మ చెరువు పూర్తి స్థాయిలో నిండింది. గడిచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువు ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు పోటెత్తింది. దీంతో చెరువు నిండగా, మంగళవారం అలుగు పారింది. ఆయకట్టు రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

రేపు 'చలో కలెక్టరేట్'

దుమ్ముగూడెం: పోడు సాగుదారులందరికీ పెండింగ్‌లో ఉన్న హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జులై 18న కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని ముసలమడుగు, ఫీరాయి గూడెం, పెదబండిరేవు, ములకనాపల్లి, మానుగట్ట తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో జరిగే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మర్మం చంద్రయ్య, ఖాదర్ బాబు, సోయం వీరరాజు, పాయం లక్ష్మయ్య, మడివి మల్లయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

చర్ల: పోడు భూములన్నింటికీ హక్కుపత్రాలివ్వాలని, ఆదివాసీలకు ఎస్టీ కుల ధృవపత్రాలివ్వాలని తెలంగాణా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్ చేశారు. చర్ల మండలంలోని ఆదివాసీల సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం ఆయన చర్ల మండలంలోని సత్యనారాయణపురం, బట్టిగూడెం, తిమ్మిరిగూడెం తదితర గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18న చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని కరపత్రాలను పంపిణీ చేశారు.టీఏజీఎస్ నాయకులు కారం నరేష్, తాటి నాగమణి, పుల్లయ్య పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కల్లూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం భద్రాచలం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పట్టణ నాయకుడు సాధన పల్లి సతీష్ అధ్యక్షతన ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కల్లూరు వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ.. భద్రాచలం కాలనీల్లో వర్షపు నీరు ఎక్కువ మోతాదులో చేరి దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిట్టిపోతుల కృష్ణయ్య, పితాని మనసే, కుక్కిరేణి అశోక్ కుమార్, కంభం మెట్టు శ్రీనివాస్, సాగర్, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

కరకగూడెం: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో ఎన్నో ఏళ్ల నుంచి పని చేస్తున్న వీఓఏ (గ్రామ సంఘ నాయకులు)ల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని, వారి సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ ఆవేదన అన్నారు. మంగళవారం కరకగూడెం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వీఓఏల యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. వీఓఏలకు కనీస వేతన చట్టం అమలు చేసి, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అనంతరం ఆయనను పలువురు వీఓఏలు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు వేల్పుల మల్లికార్జున్, లక్ష్మీ కుమారి, గడ్డం వెంకటేశ్వర్లు, బిక్షం, మండల సీపీఐ కార్యదర్శి సతీష్, కరకగూడెం గ్రామ సంఘ నాయకుల మండల అధ్యక్షురాలు ముత్యాల రమాదేవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై అవగాహన



కరకగూడెం: పద్మాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, పిల్లలు

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయతీలో అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, అంగన్‌వాడీ టీచర్లు వీరకుమారి, వంక నాగమణి, వి.లీలావతి, వై.జయలక్ష్మి పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అశ్వారావుపేట సీడీపీఓ రోజారాణి కోరారు. మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో మంగళవారం అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడారు. అనంతరం కేంద్రాల ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, పద్మావతి, సౌజన్య, టీచర్లు పాల్గొన్నారు.

దమ్మపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణంలో, నూతన పాఠ్యప్రణాళికతో విద్యాబుద్ధులు నేర్పించనున్నట్లు మల్లారం సెక్టార్ అంగన్‌వాడీ సూపర్వైజర్ సాలమ్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని జమేదారుబంజర, కొమ్ముగూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేపట్టారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: చిన్నారులను గుర్తించి అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'అమ్మ మాట- అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతారం సూపర్ వైజర్ రాజమణి ఆధ్వర్యంలో పద్మాపురం అంగన్‌వాడీ కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. టీచర్లు అనురాధ, సుజాత, స్వర్ణలత గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.